పత్రికాప్రకటన కాకినాడ, 9.8.2018

పరిశ్రమల లోపల, బయటా ఎదురైయ్యే ప్రమాదాల నివారణకు సంసిద్ధతతో కూడిన అప్రమత్తత సదా అవసరమని జాయింట్ కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు.

గురువారం ఉదయం స్థానిక బీచ్‌రోడ్‌లోని కోరమాండల్ ఫెర్టి లైజర్స్ తూర్పు గేటు వద్ద డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్, గోదావరి ఈహెచ్ఎస్ అసోషియేషన్‌ల ఆధ్వర్యంలో పరిశ్రమలలో రసాయినిక ప్రమాదాల కారణంగా ఆఫ్ సైట్ ఎమర్జెన్సీ పరిస్థితులు ఎదురైనపుడు పాటించవలసిన అప్రమత్త, చర్యలపై మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిశ్రమలు, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ఎ.మల్లికార్ధున ముఖ్య అతిధిగాను, డైరక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ జి.బాలకిషోర్ విశిష్ట అతిధిగాను హజరైయ్యారు. కార్యక్రమంలో తొలుత అతిధులు కోరమాండల్ గేట్ వద్ద మొక్కలు నాటి మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ పారిశ్రామిక ప్రగతికి ప్రమాదరహితమైన సురక్షిత వాతావరణం అత్యవసరమన్నారు. జిల్లాలో పారిశ్రామిక భద్రత పర్యవేక్షణకు పరిశ్రమలు, వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఏర్పాటైన డిస్ట్రిక్ క్రైసిస్ గ్రూప్ కృషి చేస్తోందన్నారు. జిల్లాలో ప్రమాదాలు జరిగేందుకు అస్కారం ఉన్న 21 పరిశ్రమలను గుర్తించి వాటి లోపల, బయట ప్రమాదాలు అరికట్టేందుకు, పర్యావరణం, పరిసర జనావరణాల రక్షణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడం జరిగిందన్నారు. ఈ పరిశ్రమల ప్రాంగణాలలో ప్రమాద నివారణ యంత్రాగాన్ని సంసిద్ధతపరస్తూ ఇన్‌సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ కార్యక్రమాలు గడచిన 3 ఏళ్లుగా ప్రతి 6 నెలల కొకసారి నిర్వహించడం జరుగుతోందన్నారు. అలాగే వివిధ పరిశ్రమల వద్ద అందుబాటులో ఉన్న ప్రమాద నివారణ సాధన సంపత్తిని, మానవ వనరులను ఆపత్ సమయాల్లో సమిష్టిగా వినియోగించుకునేందుకు పరస్పర సహకారం, సమన్వయం పాటించడం జరుగుతోందన్నారు. పారిశ్రామిక ప్రాంగణాల లోపల జరిగే ప్రమాదాలను అరికట్టే వ్యవస్థలు పటిష్టంగా ఉన్నప్పటికీ, ప్రాంగణాల బయట ఆఫ్ సైట్‌లో జరిగే ప్రమాదాల నివారణ, రక్షణలో జిల్లా యంత్రాంగం సహకారం తప్పని సరిగా కావాలన్నారు. రాష్ట్రంలో ప్రమాద భరిత పరిశ్రమలు విశాఖపట్నం తర్వాత తూర్పు గోదావరి జిల్లాలోనే అధికంగా ఉన్నాయని, ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని పరిశ్రమల బయట సంభవించే ప్రమాదాలను ఎదుర్కొవడంలో సంసిద్ధత, అప్రమత్తతల బేరిజు వేసేందుకు, భద్రతాపరమైన వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు జిల్లాలో తొలిసారి ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీపై మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ మాక్‌డ్రిల్ విపత్తుల నివారణలో సైంటిఫిక్ మోడల్‌గా నిలుస్తుందని, జెఎన్‌టియు విద్యార్ధులు కూడా ప్రోజెక్ట్ అధ్యయనం, భద్రతా ప్రణాళికల రూపకల్పనలో పాల్గొనడం ముదావహమన్నారు. డైరక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.బాలకిషోర్ మాట్లాడుతూ పారిశ్రామిక ప్రమాద నివారణలో జిల్లా యంత్రాంగం అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. వ్యవస్థాపరమైన లోపాలు, మానవ తప్పిదాల వల్ల జరిగే రసాయనిక ప్రమాదాలను అరికట్టడంపై అంతర్జాతీయ కన్సల్టెంట్ సంస్థల సహకారంతో రూపకల్పన చేసిన ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ ప్రణాళికలను మాక్‌డ్రిల్‌లో చేపట్టడం జరిగిందన్నారు.

అనంతరం నిర్వహించిన మాక్‌డ్రిల్‌లో అమ్మోనియా గ్యాస్ లీకేజి, సహజవాయు పైపులైన్ లీక్, ప్రమాదం జరిగిన టాంకరు నుండి పెట్రోలు లీక్‌లను సురక్షితంగా అరికట్టే మూడు అంశాలను నిర్వహించారు. తొలుత కోరమాండల్ ఫ్యాక్టరీలో స్టోరేజి ట్యాంక్ అవుట్‌లెట్ నుండి ప్రమాదకరమైన అమ్మోనియా వాయువు లీకేజిని వాటర్ జెట్ కర్టెనింగ్ పరికరాలతో అరికట్టడం, ప్రమాదంలో చిక్కుకున్న సిబ్బందిని రక్షించడం, పరిసర ప్రాంతంలోని ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించడం ప్రక్రియలను నిర్వహించారు. అలాగే విషమ పరిస్థితులలో జిల్లా యంత్రాంగంతో రక్షణ, సహాయ చర్యల సమన్వయ ప్రక్రియను కలెక్టరేట్‌లో డిఆర్ఓ నేతృత్వంతం వివిధ ప్రభుత్వ శాఖలతో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ అనసంధానంతో చేపట్టారు. ప్రమాద సమాచారం కంట్రోల్ రూమ్‌కు అందిన వెంటనే ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్, అగ్నిమాపక దళాలు, ఆంబులెన్స్‌లతో వైద్య బృందాలు, రెడ్ క్రాస్ బృందాలను ప్రమాద స్థలానికి పంపడం జరిగింది. అనంతరం సహజవాయు పైపులైన్ లీకేజి సంభవించినపుడు చేపట్టే రక్షణ చర్యలపై మాక్‌డ్రిల్‌ను నిర్వహించారు. కోరమాండల్ సంస్థ తూర్పు గేట్ సమీపంలో గెయిల్ సంస్థ ద్వారా ఎన్ఎఫ్‌సిఎల్ సంస్థకు సహజవాయువు సరఫరా చేస్తున్న 18 అంగుళాల పైపులైన్ లీక్‌ను డ్రై కెమికల్ స్ప్రేయింగ్ ద్వారా అరికట్టడం, రాజమండ్రిలోని సెంట్రల్ కంట్రోల్ రూమ్ నుండి గ్యాస్ ప్రెషర్, సరఫరాలను నియంత్రించడం, సమీప పరిసరాల్లోని ప్రజలను అప్రమత్తం చేయడం తదితర సంసిద్ధతా చర్యలను నిర్వహించారు. అలాగే రోడ్డు ప్రమాదంలో పెట్రోల్ ట్యాంకర్ నుండి పెట్రోలు లీకతై ఫోమ్, నీరు స్ప్రేయింగ్ ద్వారా మంటలు చెలరేగకుండా అరికట్టే అంశాన్ని ఆయిల్ కంపెనీలు, అగ్నిమాపక శాఖలు నిర్వహించాయి.

ఈ కార్యక్రమాల్లో ఫాక్టరీస్ శాఖ జాయింట్ ఛీఫ్ ఇన్స్‌పెక్టర్ డి.చంద్రశేఖర వర్మ, డిప్యూటీ ఛీఫ్ ఇన్స్‌పెక్టర్ శివకుమార్ రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి రత్నబాబు, కాకినాడ ఆర్‌డిఓ ఎల్.రఘుబాబు,కోరమాడంల్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ యం.జ్ఞానసుందరం, సేఫ్టీ హెడ్ పి.వి.రావు, కంట్రోల్ రూమ్ నుండి డిఆర్ఓ ఎస్‌వివిఎస్ సుబ్బలక్ష్మి, పరిశ్రమల శాఖ జియం ఎపి పటేల్, డిటిసి సిరి ఆనంద్, పోలీస్, వైద్య ఆరోగ్యం, పోల్యూషన్ కంట్రోల్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

(సమాచార శాఖచే జారీ)